30 ఏళ్ల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

- ఎస్సీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్న మేధావి వర్గం
- ఉద్యోగాలిచ్చే స్థాయికి మనబిడ్డలు ఎదగాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవిని గజమాలతో సత్కరిస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: 30ఏళ్ల పోరాటాల ద్వారానే ఎస్సీ వర్గీకణ సాధ్యమైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీఓ భవనంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ నిర్వహించిన కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కాగా, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను మేధావి వర్గం స్వాగతిస్తున్నాయన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా పిల్లలను చదివించాలని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించుకోవడం కోసం పోరాటాలు చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ముఖ్యం కాదని, పది మందికి ఉద్యోగాలిచ్చే స్థితికి మన బిడ్డలు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి జిల్లా కేంద్రంలో కొన్నివేల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణకేంద్రం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి..

ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి అసువులు బాసిన మాదిగ అమరవీరుల కుటుంబాలను, మాదిగ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలుపరిచిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపరిచిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాదిగ జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి దేవన్న, నాయకులు శ్రీనివాసులు, కృష్ణ, రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, బాలరాజు, పాతూరు రమేష్, సురేష్, కృష్ణ, దినేష్, మొగులయ్య, కృష్ణ, రంగస్వామి, రవి, చెన్నయ్య, రాజారాం, అరుణ్, వెంకట్రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జనంపల్లి దిలీప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిమాన్వితుడైన లక్ష్మీనారాయణస్వామి కల్యాణం బుధవారం ఉదయం నిర్వహిస్తారన్నారు. గురువారంరథోత్సవం, శుక్రవారం శకటోత్సవం, శనివారం చక్ర తీర్థం కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

నేటి నుంచి శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోగల శ్రీచౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సంఘ విశ్వనాథ్, అధ్యక్షుడు నలిగేశి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగం ఆంజనేయులు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రతిఏడాది మాఘ పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు జరుపుతామని పేర్కొన్నారు. బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, లలిత సహస్ర పారాయణం, సాయంత్రం జల్దిబిందె ఉత్సవం నిర్వహిస్తామని వివరించారు. 13వ తేదీ(గురువారం) అఖండ జ్యోతుల ఊరేగింపు, పూజలు నిర్వహిస్తారని, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

సొంత ఖర్చులతో రోడ్డు పనులు

నవాబుపేట: మండల కేంద్రంలో ఎస్ఎస్ కాలనీలో రోడ్డు లేకపోవడంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి, సుధాకర్‌చారిల సొంత ఖర్చులతో తాత్కాలిక రోడ్డు వేయించారు. రూ.లక్షతో చేపడుతున్న ఈ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ అంజయ్య, నిరంజన్, మహేష్, నాగలింగం, నరేష్, శేఖర్‌రెడ్డి, నర్సింహులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దేవరకద్ర: మండలంలోని డోకూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈఓ బలరాం పరిశీలించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

హెచ్‌ఎం ఎంపికపై హర్షం

కోయిల్‌కొండ: రాష్ట్రస్థాయిలో జరిగే సైన్స్ సెమినార్‌కు మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోళ్ల నర్సింహులు ఎంపిక అయ్యారు. ఈసందర్భంగా 'ఆహారం–పోషకాహారం, విద్య' అనే అంశం రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైనట్లు డైరెక్టర్ రమేష్ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. మంగళవారం ఆయన ఎంపికపై ఎంఈఓ వెంకట్‌జీ, పీఆర్టీయూ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వచ్చే ఎండాకాలంలో ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 33/11, 11 కేవీ కొత్త విద్యుత్‌లైన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ముగ్గురికి జైలుశిక్ష

హన్వాడ: మండలంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారికి ముగ్గురికి జైలుశిక్ష ఖరారైనట్లు ఎస్ఐ వెంకటేష్ మంగళవారం తెలిపారు. ఇటీవలే నిర్వహించిన డ్రెంకెన్ డ్రైవ్‌లో మండలంలోని రామాంజనేయులు, దత్తాత్రేయ, ప్రశాంత్ పట్టుబడ్డారు. వారిని జిల్లా జ్యూడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రామాంజనేయులు, దత్తాత్రేయకు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా 3రోజులు, 2రోజులు జైలుశిక్ష విధించారు. డి.ప్రశాంత్‌కు రూ.3వేల జరిమానా ఒక్కరోజు జైలుశిక్షను ఖరారు చేయగా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మిక సమస్యలను పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్మిక సమస్యలను తమదృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్మికులను దూషించడం తగదంటూ ఈనెల 8న మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ చాంబర్‌ను ముట్టడించి కొద్దిసేపు ధర్నాచేసిన విషయం విదితమే. ఆరోజు ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి ఆయనను చాంబర్‌లో కలిసి తమ సమస్యలను ప్రస్తావించారు. ఇకనుంచి అందరూ సామరస్యంగా కలిసి పనిచేద్దామని కమిషనర్ అన్నారు. రోడ్ గ్యాంగ్‌మన్ నాగరాజు నాలుగేళ్ల క్రితం చనిపోగా ఆయన కుమారుడు నటరాజ్‌కు కారుణ్య నియామకం కోసం కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో రూ.5 క్యాంటీన్ ప్రారంభం

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఆవరణలో మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రూ.5 క్యాంటీన్‌ను మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన ఆహారం కేవలం రూ.5లకు అందిస్తారన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి రోగులకు స్వచ్ఛమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామాలకు మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణ పథకం ద్వారా మండలంలోని ఫతేపూర్ నుంచి భవానీతండా వరకు రూ.1.75కోట్లు, ఫతేపూర్ నుంచి వడ్డెగుడిసెలు వరకు రూ.90లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కోడూర్ రోడ్ నుంచి తెలుగుగూడెం వరకు కోటి రూపాయలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, పీఆర్ డీఈ విష్ణు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు రఘునాయక్, లాలునాయక్, పాండు, భాస్కర్, హీర్యానాయక్, గోవింద్‌యాదవ్ శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, చందర్ తదితరులు పాల్గొన్నారు.

'మహా నగరోత్సవం' ఏర్పాట్ల పరిశీలన



శిల్పారామంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా మారినందున ఈనెల 14, 15వ తేదీల్లో 'మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం' నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. మంగళవారం దీనికి సంబంధించి శిల్పారామంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితర అధికారులతో చర్చించారు. వేదిక, స్టాళ్ల ఏర్పాట్లు, సాంస్కృతిక ప్రదర్శనలకు సంబంధించి సూచనలిచ్చారు. ఆమె మాట్లాడుతూ మొదటి రోజు ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మరుసటి రోజు రాత్రి 8.30గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఫన్‌గేమ్స్, మూవీ నైట్, మార్కెట్, ఫుడ్ స్టాళ్లు, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. నగర ప్రజలందరికీ ఈ రెండు రోజులు ఉచితంగా లోపలికి అనుమతిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

5,09,818 మంది ఓటర్లు

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటరు జాబితా విడుదల
- పురుషుల కంటే 2,590 మహిళలు అధికం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల సంఖ్య తేలింది. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్‌రెడ్డి ఓటర్ జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 5,09,818 ఓటర్లు ఉండగా.. పురుషులు 2,53,611, మహిళలు 2,56,201, ఇతరులు ఆరుగురు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,590 మంది అధికంగా ఉన్నారు. ఈ జాబితాపై ఈనెల 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలను 14వ తేదీన పరిష్కరించి 15వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. కాగా.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది స్పష్టంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించనప్పటికీ.. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసుకొని ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం అవుతుంది. ఇప్పటికే ఎన్నికల సామగ్రి ఆయా మండలాలకు చేర్చారు. ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	మహిళలు
అడ్డాకుల	12,287	12,461
బాలానగర్	17,095	16,720
భూత్పూర్	13,641	13,693
చిన్నచింతకుంట	15,198	16,212
దేవరకద్ర	13,004	13,389
గండేడ్	18,085	18,248
హన్వాడ	20,340	20,549
జడ్చర్ల	20,494	21,158
కోయిలకొండ	26,293	26,204
కౌకుంట్ల	8,698	8,849
మ.నగర్ రూరల్	17,325	17,647
మిడ్జిల్	12,556	12,791
మహమ్మదాబాద్	15,641	15,529
మూసాపేట	11,042	11,016
నవాబుపేట	20,835	20,544
రాజాపూర్	11,077	11,196

■ బాలానగర్, మహబూబ్‌నగర్ రూరల్‌లో ఒకరు చొప్పున, కోయిలకొండ, మహమ్మదాబాద్ మండలాల్లో ఇద్దరేసి చొప్పున మొత్తం ఆరుగురు ఇతర ఓటర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని గాజులపేట గ్రామ మాజీ ఎంపీటీసీ బంగారు పెద్దవెంకటయ్య భార్య బాలమణేమ్మ అనారోగ్యంతో మరణించింది. అలాగే చిన్నదర్పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రమేష్‌నాయక్ తల్లి అంజమ్మ, మాజీ కౌన్సిలర్ పడాకుల లక్ష్మమ్మ మంగళవారం మృతి చెందగా ఆయా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. వీరి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కోయిల్‌కొండ: మండలంలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు అందించే ఎరువుల్లో నాణ్యత పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల్లో నాణ్యత లోపిస్తే తమ దృష్టికి తీసుకరావాలని ఆయన రైతులకు సూచించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన ఎండీ.జాహంగీర్ కొన్నాళ్ల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ 'నిమ్స్'లో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం బాధితుడిని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జయన్నగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రూ.35వేలను పోగుచేశారు. వాటిని కూడా మాజీ జెడ్పీటీసీతో బాధితుడికి అందజేయించారు. మాజీసర్పంచ్ జయన్నగౌడ్, నాగరాజు, యాదయ్య, బాలయ్య యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రాము ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..

కోయిల్‌కొండ: కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందిన నజిరుద్దీన్ కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులంతా కలిసి స్నేహితుడి కుటుంబానికి రూ.52,600 సాయం అందించారు.

'జయంతిలో పాల్గొనాలి'

మహమ్మదాబాద్: గిరిజనులంతా తమ ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనాలని ఉమ్మడి గండేడ్ మండల మాజీ ఎంపీపీ శాంతీబాయి అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగితాలుకా స్థాయిలో చౌడాపూర్ మండల్ మక్తవెంకటాపూర్‌లో జరిగే సంత్ సేవాలాల్ 286వ జయంతి కార్యక్రమానికి టీఎస్ సెల్ అధ్యక్షుడు శివరాం నుంచి అన్నితండాల ప్రజలకు మంగళవారం ఆహ్వానం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతిని ఈనెల15న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పరిగి ఎమ్మెల్యేతో బాటు ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

లీకేజీలకు మరమ్మతు

దేవరకద్ర: మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల తాగునీటిని అందించే పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. దేవరకద్ర–రాయిచూర్ రోడ్డులోని వీరప్పయ్య కాంప్లెక్స్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కావడంత జేసీబీతో వెలికి తీసి మరమ్మతులు చేశారు. అమ్మాపూర్ రోడ్డులో లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌ను వెలికి తీసి రిపేర్‌చేశారు.

ఎస్పీని కలిసిన జడ్చర్ల సీఐ కమలాకర్



ఎస్పీని కలిసిన జడ్చర్ల సీఐ కమలాకర్

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల: జడ్చర్ల పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు తీసుకున్న బి.కమలాకర్ మంగళవారం ఎస్పీ డి.జానకిని మర్యాదపూర్వకంగా కలిశారు. మల్టీజోన్–2లో వెయిటింగ్‌లో ఉన్న సీఐ కమలాకర్ జడ్చర్ల టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఆదిరెడ్డి హైదరాబాద్ ఐజీ మల్టీజోన్–2కు బదిలీకాగా వెయిటింగ్‌లో ఉంచారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి వల్లే రాత్రికి రాత్రే సీఐని అక్కడి నుంచి బదిలీచేయగా గంటల వ్యవధిలో నూతన సీఐ కమలాకర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో బాధ్యతలు తీసుకున్నారు.

బీజేపీలోకి సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు

రాజాపూర్: సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌తో పాటు సబావట్ విజయ మంగళవారం ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కాషాయ కండువా కప్పి శ్రీనివాస్ దంపతులను ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి బీజేపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. సీతారాంనాయక్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, రవినాయక్, రితేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్‌లో పిచ్చిమొక్కల తొలగింపు

జడ్చర్ల టౌన్: గురువారం షబ్–ఏ–బరాత్‌ను పురస్కరించుకుని పట్టణంలోని 19వ వార్డు ఫజల్‌బండలో ఉన్న ముస్లింల ఖబ్రస్తాన్‌లో మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలను తొలగించారు. జేసీబీ సహాయంతో ముళ్లకంప, పిచ్చిమొక్కల తొలగింపును పారిశుద్ధ్య కార్మికులు చేపట్టారు. ఈకార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్ సాజిదా సుల్తాన్ పర్యవేక్షించారు. షేక్ సలీం, ఇఫ్తెకారొద్దీన్, ముఖీద్, ఈటె శ్రీను, అజహర్, నవాజ్ పాల్గొన్నారు.

కోళ్ల పెంపకందారులకు అవగాహన

జడ్చర్ల: కోళ్ల పెంపకందారులు కోళ్లకు వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డా.శివరాజ్ అన్నారు. మంగళవారం మిడ్జిల్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో గల కోళ్లఫారాల వద్దకు వెళ్లి పెంపకందారులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. చనిపోయిన కోళ్లను, తదితర పక్షులను గొయ్యిలో సున్నం, మట్టి వేసి పూడ్చడంతో వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. కోళ్ల ఫారాల్లో పనిచేసేవారు తమ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, మాస్కులు ధరించాలని సూచించారు.

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

- జిల్లా ధూప, దీప నైవేద్య అర్చక సంఘం ప్రతినిధులు



తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని ఉమ్మడి జిల్లా ధూప, దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగం మహేష్, కుమారస్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవలే కాలంలో అర్చకులపై వరుసగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈదాడిని ఖండిస్తూ రాష్ట్ర ధూప, దీప నైవేద్య అర్చక సంఘం పిలుపుమేరకు బుధవారం చలో చిలుకూరు బాలాజీ ఆలయం కార్యక్రమం చేపట్టి సంఘం తరపున సంఘీభావం తెలుపుతామన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తూ శ్రీవైష్ణవ వైఖానస బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మహబూబ్‌నగర్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న బ్రాహ్మణులపై అరాచాకాలు సృష్టిస్తూ దాడులు చేయడం సరికాదన్నారు. నిరసనలో పవన్‌కుమారాచార్యులు, రాచాల నరహరిచార్యులు, మణిఆనంద్ కుమారాచార్యులు, నందిపాటి నర్సింహాచార్యులు, కార్తీకాచార్యులు, రాము చార్యులు, భరత్‌కుమార్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల సేవలు మరువలేనివి



ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలుగు సంగీత లోకానికి ఘంటసాల వెంకటేశ్వర్‌రావు అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి వారు మాట్లాడారు. ఘంటసాల తన పాటలతో ప్రపంచంలోని కోట్లాది జనుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. తెలుగుపాటకు వరం ఘంటసాల స్వరం అని అన్నారు. కార్యక్రమంలో కె.రాములు, వెంకటస్వామి, శ్రీనివాసులు, హరిప్రసాద్, కె.లక్ష్మణ్, రాజు, వి.నారాయణ, నాగరాజు, చంద్రశేఖర్, కృష్ణయ్య, రాములు, దర్పల్లిశ్రీనివాసులు, పవన్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ నిర్ధారణ శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం సూక్ష్మజీవ శాస్త్రవిభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ శాతం నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డా.నర్మద ప్రారంభించి మాట్లాడారు. బ్లడ్‌గ్రూప్‌తో పాటు హిమోగ్లోబిన్ శాతం తెలియడంతో రక్తహీనత సమస్య తెలిసిపోతుందన్నారు. సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి డా.మాధురి మాట్లాడుతూ హిమోగ్లోబిన్ శాతం తెలుసుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. 150మందికి పరీక్షలు నిర్వహించగా 30శాతం రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలిపారు.

శ్రీనివాసుడి సన్నిధిలో తిర్మలాపూర్ వాసులు



రాజాపూర్: హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుమలలో మంగళవారం నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిర్మలాపూర్ భక్తులు పాల్గొన్నారు. శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి భజనమండలి ఆధ్వర్యంలో శ్రీనివాసుడి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తనలో పాలు పంచుకోవడం అదృష్టమని భక్తులు పేర్కొన్నారు. సేరినారాయణరెడ్డి, జగదీశ్వర్, భీమయ్య,యాదయ్య బాలయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

నేడు 'ఇంటింటా భజన-మన ఇంట్లో భజన'

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో బుధవారం రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో 'ఇంటింటా భజన -మన ఇంట్లో భజన' 100వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు సీమ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బుధవారం ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు 100వ బుధవారం కార్యక్రమం సందర్భంగా తెల్లవారుజామున 3గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అఖండ భజనలు ఉంటాయని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని సంగనోనిపల్లి గ్రామపరిధిలోని ఎల్దీప్‌తండాలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సహకారంతో రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జి.రవీందర్, వై.విద్యాసాగర్‌గౌడ్ మాట్లాడారు. గ్రామాలు, తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యాదయ్యయాదవ్, నారాయణరెడ్డి, బసిరెడ్డి, శ్రీను, శ్రీనువాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేష్, మెగ్యానాయక్, గోపాల్‌నాయక్, హనుమంతు పాల్గొన్నారు.

జీతాల కోసం నిరసన



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలకోసం మంగళవారం బాదేపల్లి సీహెచ్‌సీ పాత భవనం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష్ మాట్లాడారు. ప్రతినెలా 1వ తేదీన వచ్చే జీతాలు రాకపోవటంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయని వాపోయారు. 11వ తేదీ వచ్చినా 220 మంది కార్మికులకు జీతాలు రాకపోవటంతో ఆర్థికంగా కష్టాలు పడాల్సి వస్తుందన్నారు.చంద్రమౌళి, బాలస్వామి, గిద్దశంకర్, విద్యాసాగర్, యాదమ్మ, కొండమ్మ, రమేషు, లక్ష్మమ్మతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా శిరీష, డీఈఓగా శివ, ఎంఈఓగా మహేష్, ప్రధానోపాధ్యాయులుగా శృతి వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ప్రధానోపాధ్యాయులు హేమలత, విజయలక్ష్మి, లలితరాణి, మొగులయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆలయం వద్ద వేలం నిర్వహణ

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద త్వరలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలయం వద్ద టెంకాయల వేలం, లడ్డూ, పులిహోర ప్రసాదాలు, కొబ్బరిచిప్పల సేకరణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఈఓ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో బహిరంగ వేలంవేశారు. టెంకాయలను రూ.10.15 లక్షలకు మహబూబ్‌నగర్‌కు చెందిన వి.మురళీ, లడ్డూ పులిహోర ప్రసాదాల విక్రయాలను కందూర్‌కి చెందిన మనోహర్, శివరాత్రి నుంచి ఉగాది వరకు కొబ్బరిచిప్పలను పోగుచేయడాన్ని రూ.71వేలకు అయిజకు చెందిన ముకేష్ బహిరంగ వేలంలో దక్కించుకున్నారు. కొబ్బరికాయల విక్రయం, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాలు ఈనెల 27న ప్రారంభమై వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న ముగుస్తుందని ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు. రవీందర్‌శర్మ, కారెడ్డి నాగిరెడ్డి, తోట శ్రీహరి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్ ఉన్నారు.